# నింగికేగిన కళాతపస్వి విశ్వనాథుడు

## (ప్రముఖ సినీ దర్శకుడు కాశీనాథుని విశ్వనాథ్ శివైక్యం చెందిన వేళ అక్షర నివాళి)

'ఈ గాలి ఈ నేల ఈ ఊరు సెలయేరు'ను వదిలి ప్రేక్షకులను కన్నీటి సంద్రంలో ముంచి దివికేగెను వెండి తెర దర్శకుడు, ప్రముఖ నటుడు, రచయిత మన తెలుగింటి కాశీనాథుని విశ్వనాథుడు. 'సువ్వి సువ్వి సువ్వాలమ్మా సీతాలమ్మా' అన్న పాట విన్నా, 'దొరుకునా ఇటువంటి సేవ' అంటూ తలలూపినా', 'చరణ కింకినులు ఘల్లు ఘల్లు మన' పాటకు కాళ్లూపినా, 'తెలవారదేమో స్వామి' అంటూ పూజాలోకంలో విహరించినా, 'ఝుమ్మందా నాదం సయ్యంది పాదం' అంటూ శ్రోతలను సంగీత లోకంలో ఊయలలూపినా అది ఆయనకే స్వంతం. ఐదు దశాబ్దాలకు పైగా వెండి తెరపై పలు కళాఖండాలకు జీవం పోసిన కళాతపస్వి అచ్చ తెలుగు సంస్కృతికి ప్రతి రూపం. తెలుగు పాటకు రాగాన్ని, నాట్యాన్ని నేర్పిన ధీశాలి. తెలుగు మాటకు సంస్కారాన్ని అద్దిన మేరునగ ధీరుడు. భారతీయత, శాస్త్రీయ సంగీతాల పునాదిగా ఆయన తీర్చిదిద్దిన సినిమాలు చిత్ర పరిశ్రమ గతిని మార్చడం ఓ అద్భుతం. తెలుగు సినిమాకు అపూర్వ గౌరవాన్ని, అంతర్జాతీయ గుర్తింపును ఆర్జించి పెట్టిన ఏకైక దర్శకుడు మన విశ్వనాథుడు. మూస పద్ధతిలో కొట్టుకుపోతున్న తెలుగు సినిమాను 'శంకరాభరణం'తో మరో మలుపు తిప్పిన అమోఘ దర్శకుడు కె. విశ్వనాథ్. దర్శకుడు, నటుడు, రచయిత, సౌండ్ రికార్డిస్టుగా బహుముఖ ప్రజ్ఞను పరిచయం చేసిన విశ్వనాథుడు ఇక లేరు అనే వార్తతో తెలుగు లోగుళ్లు కళావిహీనంగా మారాయనడంలో అతిశయోక్తి లేదు. శాస్త్రీయ సంగీతం, శాస్త్రీయ నాట్యం, భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు పెద్ద పీట వేసిన కాశీనాథుని విశ్వనాథ్ జీవన విలువలు ఇతర సినీ నిర్మాతలు, దర్శకులకు నవ్య దారి దీపంగా నిలిచారు. చారిత్రక సినిమాలను తాను తీయలేనని, ప్రముఖ దర్శకులు బాలచందర్, బాపుల వద్ద సహాయ దర్శకులుగా పని చేయాలని ఉందని వినమ్రంగా ప్రకటించిన విశ్వనాథ్ విలక్షణ వ్యక్తిత్వం నేటి సినీ పరిశ్రమకు దర్శకత్వం వహించాలని కోరుకుందాం.

### వ్యక్తిగత జీవితం:

19 ఫిబ్రవరి 1930న కాశీనాథుని సుబ్రహ్మణ్యం సరస్వతమ్మ పుణ్య దంపతులకు గుంటూరు జిల్లా రేపల్లె సమీపానగల పెద పులుమర్రు గ్రామంలో జన్మించిన విశ్వనాథ్ అదే గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్య, విజయవాడలో ఉన్నత పాఠశాల విద్య, గుంటూరు హిందూ కాలేజీ/ఏ సి కాలేజీల్లో ఉన్నత విద్య (బియస్సీ) పూర్తి చేశారు. సినీ ప్రేక్షకులతో పాటు జీవిత భాగస్వామి జయలక్ష్మి, కూతురు పద్మావతి, కుమారులు నాగేంద్రనాథ్, రవీంద్రనాథ్‌లను శోక సంద్రంలో ముంచి స్వర్గానికి చేరిన విశ్వనాథ్ తెలుగు సినిమాకు దొరికిన కోహినూర్ వజ్రం, తెలుగు తెరపై సిరివెన్నల జల్లులు కురిపించిన చల్లని చందమామ.

### సినీ జీవిత విశేషాలు:

చెన్నైలోని వాహిని సినీ స్టూడియోలో సౌండ్ రికార్డిస్టుగా చలన చిత్ర పరిశ్రమలో ప్రవేశించిన విశ్వనాథ్ ప్రతిభను ప్రదర్శించి నాటి ప్రఖ్యాత దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు దృష్టిని ఆకర్షించి సహాయకుడిగా చేరారు. అనంతరం 'ఇద్దరు మిత్రులు', 'చదువుకున్న అమ్మాయిలు', 'డాక్టర్ చక్రవర్తి', 'పాతాళ బైరవి' లాంటి సినిమాలకు సహాయ దర్శకుడిగా పని చేశారు. విశ్వనాథుని దర్శకత్వ ప్రతిభను గుర్తించిన ఏయన్ఆర్ తన నిర్మాణ సంస్థ అన్నపూర్ణ ద్వారా 'ఆత్మ గౌరవం' సినిమాతో 1965లో పూర్తి స్థాయి సినీ దర్శకుడిగా తెరంగేట్రం చేసి తొలి సినిమాతోనే 'నంది బహుమతి'ని అందుకున్నారు. 'సిరిసిరి మువ్వ' సినిమాతో ఆయన దర్శకత్వ ప్రతిభ ఎల్లలు దాటి విశ్వవ్యాప్తం అయ్యింది. విశ్వనాథ్ సినీ జీవన ప్రస్థానంలో 60కి పైగా కళాఖండాలను ప్రేక్షకులకు అందించి ప్రతి తెలుగింట్లో కుటుంబ సభ్యుడిగా మారారు. నటుడిగా కూడా 'శుభసంకల్పం', 'నరసింహనాయుడు', 'ఠాగూర్', 'అతడు', 'కలిసుందాం రా', 'మిస్టర్ ఫర్‌ఫెక్ట్', 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే' లాంటి పలు సినిమాల్లో నటించి మెప్పించిన విశ్వనాథ్ వ్యక్తిగా పరిపూర్ణ మూర్తిమత్వం ప్రదర్శించారు. 'శంకరాభరణం', 'సాగరసంగమం', 'శృతిలయలు', 'శుభలేఖ', 'సీతామాలక్ష్మి', 'సూత్రధారులు', 'జీవిత నౌక', 'జీవన జ్యోతి', 'చెల్లెలు కాపురం', 'సప్తపది', 'శారద', 'ఓ సీత కథ', 'ఆపద్బాంధవుడు', 'శుభసంకల్పం', 'సిరిసికి మువ్వ', 'స్వయంకృషి', 'స్వామి కిరణం', 'సిరివెన్నెల', 'శుభోదయం', 'స్వర్ణకమలం' లాంటి సంగీత ప్రధాన కళాఖండాల సృష్టికర్త మన కళాతపస్వి. 'ఈశ్వర్', 'సంజోగ్', 'సుర్ సంగమ్', 'సంగీత్', 'ధన్వాన్' లాంటి పలు హిందీ సినిమాలకు కూడా దర్శకత్వం వహించి ఉత్తర భారతాన్ని సంగీత డోలికల్లో ముంచెత్తారు

### వరించిన పురస్కారాలు:

వెండి తెరకు అద్వితీయ సేవలు అందించిన విశ్వనాథ్‌ను వెతుక్కుంటూ పలు అవార్డులు ముసిపోతూ తన పంచన చేరాయి. 1980లో 'శంకరాభరణం'తో జాతీయ ఉత్తమ కుటుంబ కథా చిత్రంగా జాతీయ పురస్కారం, 1982లో 'సప్తపది'తో నర్గీస్ దత్ జాతీయ చిత్రంగా పురస్కారం, 1984లో 'సాగరసంగమం'తో జాతీయ ఉత్తమ చలనచిత్ర పురస్కారం, 1986లో 'స్వాతిముత్యం' సినిమాతో జాతీయ ఉత్తమ చలనచిత్ర పురస్కారం, 1988లో 'శృతిలయలు'తో జాతీయ ఉత్తమ చలనచిత్ర పురస్కారం, 1992లో 'పద్మశ్రీ' పురస్కారం, 2004లో 'రఘుపతి వెంకయ్య' పురస్కారం, 2016లో 'దాదాసాహెబ్ పాల్కే' పురస్కారం లాంటి పలు జాతీయ స్థాయి గుర్తింపులు పొందారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వ 7 నంది అవార్డులు, పలు స్వచ్ఛంద సంస్థల పురస్కారాలు ఎన్నో విశ్వనాథుని ప్రతిభకు తలవంచాయి. 1986లో విశ్వనాథ్ సినిమా 'స్వామి ముత్యం'తో భారత అధికార సినిమాగా 'ఆస్కర్' అవార్డుకు ఎంట్రీ సాధించడం విశేషం.

శంకరాభరణం విడుదలైన 02 ఫిబ్రవరి (1979) రోజుననే కళాతపస్వి కన్ను మూయడం ఒక యాదృశ్చకమే. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న విశ్వనాథ్ హైదరాబాదులోని అపోలో ఆసుపత్రిలో 92వ ఏట తుది శ్వాస విడిచి తన కూతురు, ఇద్దరు కుమారులు, సినీ ప్రేక్షకులు, తన అభిమానులను దుఃఖ సాగరంలో ముంచి వెళ్ళి పోయారు. భారతీయ సంస్కృతి వారసత్వ సంపదలను తెలుగు తెరపై చూపించిన కాశీనాథుని విశ్వనాథ్ మనకు దొరకడం మన తెలుగోళ్లు చేసుకున్న మహాభాగ్యం. విశ్వనాథుని ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# బౌమా కాన్‌ఎక్స్‌పో 2023 నూతన ఆవిష్కరణలు

## -సాంకేతిక శ్రేణిని బలోపేతం చేసిన సానీ భారత్
## -భారతీయ అవసరాలకు తగినట్లుగా ప్రత్యేకంగా రూపొందించిన ఉత్పత్తి శ్రేణి విడుదల




హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్‌ప్రెస్ న్యూస్ );కన్‌స్ట్రక్షన్ మెషినరీ పరంగా అగ్రగామి తయారీ మరియు సరఫరాదారు సానీ, ఇటీవలనే 12 నూతన ఉత్పత్తులను విడుదల చేసింది. సానీ భారత్ ఇప్పుడు పూర్తి నూతన ఉత్పత్తి వర్టికల్‌ను అందించింది. ఇది భారతీయ రోడ్డు కాంట్రాక్టర్లకు రహదారి యంత్రసామాగ్రిని అందిస్తుంది. ఈ కంపెనీ ఇప్పుడు 25వేల యంత్రాలను పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టుల కోసం దేశవ్యాప్తంగా తయారుచేసి సరఫరా చేసిన మైలురాయిని వేడుక చేసింది. తమ అద్భుతమైన వృద్ధికి తోడు వినియోగదారులు మరియు వాటాదారులు పెట్టుకున్న నమ్మకంతో, సానీ భారత్ ఇప్పుడు పూనెలోని చకన్ వద్ద తమ ఫ్యాక్టరీలో 50కు పైగా నిర్మాణ రంగ యంత్ర పరికరాలను తయారుచేస్తోంది. 2023లో తమ ఉత్పత్తి ఆఫరింగ్‌ను గణనీయంగా విస్తరించడంతో పాటుగా ఆటోమేషన్, సస్టెయినబిలిటీ, నాణ్యత పై అధికంగా దృష్టి సారించింది. ఈ ప్రతిష్టాత్మక సందర్భంగా సానీ భారత్ మరియు సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ "మా ఉత్పత్తులను విడుదల చేయడం పట్ల చాలా సంతోషంగా ఉంది. ఈ నూతన ఉత్పత్తి శ్రేణి మా తయారీ శక్తి మరియు సాంకేతిక నైపుణ్యపు బలాన్ని ప్రదర్శిస్తుంది. ఇది మా మెరుగైన ఉత్పాదక, లాభదాయకతను మా వినియోగదారుల కోసం ప్రదర్శిస్తుంది. నాణ్యత ఈ ప్రపంచాన్ని మారుస్తుందనే మా లక్ష్యానికి కట్టుబడి ఈ మోడల్స్‌ను ప్రత్యేకంగా భారతీయ మార్కెట్ కోసం సృష్టించాము" అని అన్నారు. సానీ ఉత్పత్తులు ఈ పరిశ్రమలో గేమ్ ఛేంజర్ ఉత్పత్తులుగా నిలిచాయి. దీనిలో సాంకేతికంగా అత్యాధునికమైన డిజైన్, ఇంధన సామర్థ్యం, మెరుగైన పనితీరు, అత్యధిక విశ్వసనీయత, అత్యాధునికమైనప్పటికీ ఆకర్షణీయమైన ఫీచర్లు ఉన్నాయి. అత్యున్నత శ్రేణి యంత్రసామాగ్రి, అలా?ట్ర మోడ్రన్ మరియు అంతర్జాతీయ నాణ్యత ఉత్పత్తి శ్రేణి, మహోన్నతమైన ఫీచర్లు, శక్తివంతమైన మానవ వనరులు, డీలర్‌షిప్ నెట్‌వర్క్ కలిగిన సానీ భారత్, ఇప్పుడు ఎక్స్‌కవేషన్(తవ్వకం), హోయిస్టింగ్ (పైకి ఎత్తడం), మైనింగ్, డీప్ ఫౌండేషన్‌తో పాటుగా రోడ్డు మరియు పోర్ట్ ఎక్విప్‌మెంట్ కలిగి ఉంది. మౌలిక సదుపాయాలు, రైల్వేలు, రోడ్లు, నీటి పారుదల, శక్తి, పోర్టులు వంటి రంగాలలో గణనీయమైన పెట్టుబడులు పెట్టడానికి సానీ భారత్ ప్రణాళిక చేయడం ద్వారా ఈ విభాగాలలో సైతం తమ ఉత్పత్తి శ్రేణి మెరుగుపరుస్తుంది. ఎస్‌పీఆర్ 260 , ఎస్ఎల్‌బీ1500ఎక్స్8ఈ , ఎస్ఏపీ 100 సీ?10 , ఎస్‌సీఎం 2000 సీ?8ఎస్, ఎస్‌వై 60సీ?10 , ఎస్‌వై 215సీ?9 స్పార్క్ , ఎన్‌టీజీ140సీ?10 , ఎన్‌టీసీ 1600టీ7 , ఎస్ఆర్235 ఎం 3 , ఎస్ఆర్ 235 డీడబ్ల్యు , ఎస్‌డీ 390 ,నూతన ఉత్పత్తులని విడుదల చేసింది.

# తిరుమలలో రూ. 50 కోట్లతో ఆటోమెటిక్ లడ్డూ యంత్రాల ఏర్పాటు : టీటీడీ ఈవో

తిరుపతి, ఫిబ్రవరి 3: తిరుమలలో లడ్డూ తయారీ కోసం రూ 50 కోట్లతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసిన యంత్రాల వ్యవస్థ డిసెంబరు నాటికి అందుబాటులోకి వస్తుందని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి వెల్లడించారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్రపంచంలోనే టాప్ 1 స్థాయిలో తిరుమల మ్యూజియంను డిసెంబరు నాటికి సిద్ధం చేస్తామని తెలిపారు. ఇటీవల రథసప్తమి ఉత్సవంలో లక్షలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు, టీ, కాఫీ, పాలు, అల్పాహారాలు అందించామని వెల్లడించారు . ఓ భక్తుడు ఇచ్చిన రూ.23 కోట్ల విరాళంతో తిరుమలలో నిర్మించిన నూతన పరకామణి భవనంలో ఫిబ్రవరి 5న కానుకల లెక్కింపు ప్రారంభంకానుందని వెల్లడించారు.

' తిరుమల శ్రీవారి ఆలయ ఆనందనిలయం బంగారు తాపడం పనులను ఆరు నెలల పాటు వాయిదా వేస్తున్నా'మని , త్వరలో మరో తేదీ నిర్ణయించి ప్రకటిస్తామన్నారు. భక్తులకు మరింత మెరుగైన డిజిటల్ సేవలు అందించేందుకు ప్రయోగాత్మకంగా టీటీదేవస్థానమ్స్ పేరుతో మొబైల్ యాప్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్‌లో సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రసారమవుతున్న గరుడపురాణం భక్తుల మన్ననలు పొందుతుందని వివరించారు .

**జనవరి నెలలో 20.78 లక్షల మంది దర్శనం..**

తిరుమల శ్రీవారిని జనవరి నెలలో 20.78 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని , హుండీ ఆదాయం రూ.123.07 కోట్లు వచ్చిందన్నారు. ఈనెలలో 1.07 కోట్ల లడ్డూలను విక్రయించామని ఈవో తెలిపారు. 37.38 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని, 7.51 లక్షల మంది తలనీలాలు సమర్పించుకున్నారని వివరించారు.




ప్రముఖ రచయిత
కైపు ఆది శేషారెడ్డి గారి ఆర్థిక సహకారంతో ...
విశాలాక్షి సాహిత్య మాసపత్రిక మినీ కథల పోటీ

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం సందర్భంగా
మినీ కథల పోటీను సంయుక్తంగా నిర్వహిస్తున్నాము.

బహుమతులు -రూ. 10,000 లు

నిబంధనలు :
1. ఒక్కో కథను రూ.1000/-లు వంతున పది ఉత్తమ కథలకు నగదు బహ్యామతులు
2. మరి కొన్ని సాధారణ ప్రచురణకు స్వీకరించబడును.
3. కథలు విశాలాక్షి సాహిత్య మాస పత్రికలో ప్రచురించబడుతాయి.
4. 500-600 పదాల మధ్య మాత్రమే కథ ఉండాలి.
5. డిటిపి లేదా చేతివ్రాత ఎలా అయినా పంపవచ్చు..
6. మెయిల్, వాట్సప్ లలో స్వీకరించబడవు. Post కొరియర్ మీ వసతి మేరకు నేరుగా మాచిరునామాకు పంపవలెను
7. కథ మీద పేరు లాంటి వివరాలు ఉండకూడదు.
8. హామీ పత్రం ప్రత్యేక పేజీలో రాయాలి.
9. చివరి తేది 20-03-2023 లోపు అందాలి

చిరునామా : విశాలాక్షి సాహిత్య మాస పత్రిక
D.No. 27-5-487, పద్మావతి నగర్, బాలాజీ నగర్ చివర,
నెల్లూరు- 524002. Cell : 8008562742

# ఫిబ్రవరి 5 నుంచి హైదరాబాద్ 1 విజయవాడ హైవేపై ట్రాఫిక్ ఆంక్షలు

సూర్యాపేట , ఫిబ్రవరి 3 దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర ఈ నెల 5వ తేదీన ప్రారంభమై.. 9వ తేదీ వరకు కొనసాగనుంది. దీంతో హైదరాబాద్ ? విజయవాడ హైవే(ఔఊ 65) పై ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే వాహనదారులు.. టేకుమట్ల నుంచి ఖమ్మం బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించారు. ఈ వాహనాలన్నీ నామాపురం వద్ద జాతీయ రహదారి 65పై కలుస్తాయి. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వచ్చే వాహనదారులను రోళ్లబావి తండా వద్ద మళ్లించనున్నారు. రయాన్‌గూడెం వద్ద హైవేపై కలుస్తాయి.

హెవీ ట్రాన్స్‌పోర్టు వెహికల్స్‌ను కోదాడ వద్ద మళ్లించి, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదుగా హైదరాబాద్‌కు పంపించనున్నారు. మొత్తంగా లింగమంతుల స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. పెద్దగట్టు జాతరకు రూ. 6.5 కోట్లు కేటాయించారు. మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు, చేజింగ్ రూమ్స్ ఏర్పాటు చేశారు. తాగునీటి వసతి కల్పించారు. ఐదు రోజుల పాటు కొనసాగే ఈ జాతరకు 15 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని పోలీసులు, అధికారులు అంచనా వేస్తున్నారు.

జాతర భద్రత కోసం 1850 మంది పోలీసులు విధుల్లో నిమగ్నం కానున్నారు. 500 మంది వాలంటీర్ల సేవలను వినియోగించుకోనున్నారు. 60 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పోలీసులు పర్యవేక్షించనున్నారు.

# పోలీసులకు 120 మోటార్ బైక్ లిచ్చిన హీరో కంపెనీ




తిరుపతి, ఫిబ్రవరి 3:తిరుపతి జిల్లా పోలీసు శాఖ సిబ్బంది కోసం హీరో మోటార్స్ యాజమాన్యం కార్పొరేట్ సామాజిక భాద్యత (ఊఖీ)లో భాగంగా శుక్రవారం 120 హీరో గ్లామర్ మోటార్ బైక్ లను వితరణ చేసింది. తిరుపతి పోలీస్ పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో హీరో ఆటోమొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ చక్రవర్తి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణ రెడ్డి, జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి లకు బైక్ ల కీ ని లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ? స్వంత వాహనాలతో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి అధునాతనమైన పరికరాలు అమర్చిన 120 ద్విచక్ర వాహనాలను అందచేయడం అభినందనీయమన్నారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసుల అవసరాలకు తగినట్టుగా బైకులలో అత్యాధునిక హంగులతో అమర్చిన మైక్ సిస్టం, లైట్ సిస్టం, సైరన్ సిస్టం వంటి ప్రత్యేకతలు ఉంచడం బాగుందంటూ తమ డీజీపీ కూడా హీరో యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేయమన్నారని తెలిపారు. హీరో మోటార్స్, డీలర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ కంపెనీలో పనిచేసే మహిళా సిబ్బందిని షిఫ్ట్ సమయాల్లో పోలీస్ పేట్రోల్ నిర్వహించి ప్రశాంతంగా వారి ఇళ్లకు చేరేవిధంగా చూస్తున్నారని.. అందుకే ఉడతాభక్తిగా ఈ వితరణ చేస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ లు జెండా ఊపి 120 ద్విచక్రవాహనాల శ్రేణిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్.పి.లు వెంకటరావు అడ్మిన్, కులశేఖర్ ఎల్అండ్ఓ, విమల కుమారి క్రైమ్, సెబ్ జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, తదితర జిల్లా పోలీసు యంత్రాంగం పాల్గొన్నారు.

# బీబీసీ డాక్యుమెంటరీ వివాదంపై సుప్రీం జోక్యం.. కేంద్రానికి నోటీసులు..!

న్యూ ఢిల్లీ ఫిబ్రవరి 3 (ఎక్స్‌ప్రెస్ న్యూస్);2002లో గుజరాత్ లో జరిగిన అల్లర్లపై బీబీసీ 'ఇండియా.. ది మోదీ క్వశ్చన్' పేరిట బీబీసీ డాక్యుమెంటరీ రూపొందింది. భారత ప్రధాని నరేంద్ర మోదీపై బీబీసీ తీసిన ఈ డాక్యుమెంటరీ వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలోనే ఈ డాక్యుమెంటరీపై కేంద్రం తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదొక విద్వేష పూరిత చర్యగా అభివర్ణించిన సంగతి తెల్సిందే..!ఈ క్రమంలోనే ఈ డాక్యుమెంటరీని నిలిపివేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అయితే బీబీసీ డాక్యుమెంటరీని చూసే పౌరులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేస్తుందని.. దీనిపై నిషేధం విధించడం భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని సీనియర్ జర్నలిస్టు రామ్.. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా.. సామాజిక కార్యకర్త.. న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. మరో న్యాయవాది ఎంఎల్ శర్మ సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు.

శుక్రవారం ఈ పిటిషన్ పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. బీబీసీ డాక్యుమెంటరీ ప్రసారం నిలిపివేస్తూ తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన ఒరిజినల్ రికార్డును కోర్టుకు సమర్పించాలని సుప్రీం కేంద్ర ప్రభుత్వంతో పాటు మరికొందరికీ నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసి సుప్రీం ఆదేశాలు జారీ చేసింది.

తదుపరి కోర్టు విచారణ నాటికి బీబీసీ డాక్యుమెంటరీ నిషేధానికి సంబంధించిన ఒరిజినల్ రికార్డులకు సమర్పించాలని స్పష్టం చేసింది. కాగా "ఇండియా : ద మోదీ క్వశ్చన్" పేరిట బీబీసీ రూపొందించిన డాక్యుమెంట్ ను ఆ సంస్థ యూట్యూబ్.. ట్విటర్లో అందుబాటులో ఉంచడంతో వివాదం రాజుకుంది.బీబీసీ డాక్యుమెంట్ కాస్త వివాదాస్పద కావడంతో కేంద్రం ఈ లింకులను వెంటనే తొలగించిన గత నెల 21న ఆయా సామాజిక మాధ్యమాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే ఆ సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించగా విచారణ చేపట్టి కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. మరోవైపు ఈ డాక్యుమెంటరీపై బీజేపీ వర్గాలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి.

# లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న.. గవర్నర్ తమిళిసై



హైదరాబాద్, ఫిబ్రవరి 3:తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. కొండపైకి చేరుకున్న గవర్నర్‌కు కలెక్టర్ పమేలా సత్పతి, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్ద ఆమెకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నేరుగా స్వయంభు ఆలయంలోకి వెళ్లిన గవర్నర్.. లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పండితులు గవర్నర్‌కు ఆశీర్వచనం చేశారు. అధికారులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు.

# గోదావరి జలాలతో తెలంగాణ సస్యశ్యామలం: కొత్త ప్రభాకర్‌రెడ్డి

సిద్ధిపేట, ఫిబ్రవరి 3 బీఆర్ఎస్ నేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గోదావరి జలాలతో తెలంగాణ ను సస్యశ్యామలం చేశారని మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గం కొడకండ్ల వద్ద మల్లన్నసాగర్ జలాలను కూడవెల్లి వాగులోకి, వర్గల్ వద్ద కొండపోచమ్మ సాగర్ జలాలను హల్ది వాగు లోకి ఎంపీ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన జడ్పీ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి గంగమ్మ కు ప్రత్యేక పూజలు చేశారు.

కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాల రాకతో కూడవెల్లి, హల్దివాగు పరివాహ ప్రాంతాల పరిధిలో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారని పేర్కొన్నారు.

వేసిన వంట పొలాలు ఎండిపోయే అవకాశం ఉండటంతో రైతుల విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్ రావు ఆదేశాల మేరకు నీటిని విడుదల చేశామన్నారు.నాడు ప్రాజెక్టులు నిర్మిస్తుంటే తమకు ఉనికి ఉండదని భావించిన రాజకీయ పార్టీలు వాటిని అడ్డుకోవడానికి కోర్టులకు వెళ్లి కుట్రలు చేశారని ఆరోపించారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాతే రైతులు , సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నారన్నారని వెల్లడించారు.

తెలంగాణ మాదిరిగా దేశమంతా అభివృద్ధి, సంక్షేమం కావాలంటే బీఆర్ఎస్ తోనే సాధ్యమవుతుందన్నారు.

బీఆర్ఎస్‌కు దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అదాని అవినీతిపై దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలను ఏకం చేసి పోరాటం సాగిస్తామన్నారు. ఎల్ఐసీని కార్పొరేట్ కోరల్లో నుంచి రక్షించడానికి పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 6.4 శాతం ఆర్థిక లోటు లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:"ప్రభుత్వం ఊహించిన ఆర్థిక (ఫిస్కల్ గ్లైడ్) మార్గానికి అనుగుణంగా, జి డి పి లో %గా కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు క్రమంగా క్షీణించడం, గత రెండు సంవత్సరాలలో ఉత్సాహభరితమైన ఆదాయ సేకరణ ద్వారా జాగ్రత్తగా ఆర్థిక నిర్వహణకు మద్దతు ఇచ్చిన ఫలితం" అని 2022-23 ఆర్థిక సర్వే తెలిపింది. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు పార్లమెంటులో 2022-23 ఆర్థిక సర్వే ను ప్రవేశ పెట్టారు.

2023 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు జీడీపీలో 6.4 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. ప్రపంచ అనిశ్చితుల సమయంలో కన్జర్వేటివ్ బడ్జెట్ అంచనాలు బఫర్ ను అందించాయని సర్వే పేర్కొంది. ఆర్థిక కార్యకలాపాలు పుంజుకోవడం, ఆదాయాలు పుంజుకోవడంతో ఆర్థిక పనితీరు పుంజుకుంది

2022 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు స్థూల పన్ను ఆదాయం15.5 శాతం (ఇయర్ ఆన్ ఇయర్ - వై ఒ వి )వృద్ధిని నమోదు చేసిందని, రాష్ట్రాలకు కేటాయించిన తర్వాత కేంద్రానికి నికర పన్ను ఆదాయం 7.9 శాతం పెరిగిందని సర్వే తెలిపింది. జిఎస్ టిని ప్రవేశపెట్టడం ఆర్థిక లావాదేవీల డిజిటలైజేషన్ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు ఆర్థిక వ్యవస్థను మరింత క్రమబద్ధీకరించడానికి దారితీశాయి, తద్వారా పన్ను వలయాన్ని విస్తరించాయి. మరియు పన్ను చెల్లింపును పెంచాయి. తద్వారా జీడీపీలో వృద్ధి కంటే రాబడులు చాలా ఎక్కువ వేగంతో పెరిగాయి.

2022 ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్, వ్యక్తిగత ఆదాయపు పన్ను వృద్ధి కారణంగా ప్రత్యక్ష పన్నులు వార్షిక ప్రాతిపదికన 26% పెరిగాయని ఆర్థిక సర్వే తెలిపింది. 2023 ఆర్థిక సంవత్సరం మొదటి ఎనిమిది నెలల్లో ప్రధాన ప్రత్యక్ష పన్నులలో గమనించిన వృద్ధి రేట్లు వాటి సంబంధిత దీర్ఘకాలిక సగటుల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని సర్వే పేర్కొంది.

అధిక దిగుమతులు 2022 ఏప్రిల్ నుండి నవంబర్ వరకు కస్టమ్స్ వసూళ్లలో 12.4% వృద్ధికి దారితీశాయని సర్వే తెలిపింది. 2022 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ఎక్సైజ్ డ్యూటీ వసూళ్లు 20.9 శాతం తగ్గాయి.

జీఎస్టీ పన్ను చెల్లింపుదారుల సంఖ్య 2022లో 70 లక్షల నుంచి 1.4 కోట్లకు రెట్టింపు అయింది. 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.13.40 లక్షల కోట్లుగా ఉన్నాయి. తద్వారా నెలకు సగటున రూ.1.5 లక్షల కోట్ల వసూళ్లతో 24.8 శాతం వృద్ధి నమోదైందని సర్వే పేర్కొంది. జీఎస్ టి ఎగవేతదారులు, నకిలీ బిల్లులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన డ్రైవ్, ఇన్వర్టెడ్ డ్యూటీ స్ట్రక్చర్ ను సరిదిద్దే రేటు హేతుబద్ధీకరణ వంటి వ్యవస్థాగత మార్పుల కారణంగా జీఎస్ టి వసూళ్లు మెరుగుపడినట్లు తెలిపింది.

మహమ్మారి ప్రేరిత అనిశ్చితి, భౌగోళిక రాజకీయ సంఘర్షణ, సంబంధిత ప్రమాదాలు గత మూడేళ్లలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యాల ప్రణాళికలు, అవకాశాలకు సవాళ్లు గా మారినందున 2023 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ లో కేటాయించిన రూ.65,000 కోట్లలో 48 శాతం మాత్రమే 2023 జనవరి 18 నాటికి సేకరించామని, ఆర్థిక సర్వే పేర్కొంది.

కొత్త ప్రభుత్వ రంగ సంస్థల విధానం అసెట్ మానిటైజేషన్ స్ట్రాటజీని అమలు చేయడం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు ప్రభుత్వం తన నిబద్ధతను పునరుద్ఘాటించిందని సర్వే తెలిపింది.

2022 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో దీర్ఘకాలిక సగటు 2.5 శాతంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం క్రమంగా పెరిగిందని సర్వే తెలిపింది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఇది జిడిపిలో 2.9% కు పెరుగుతుందని అంచనా వేశారు. ఇది సంవత్సరాలుగా ప్రభుత్వ వ్యయం నాణ్యతలో మెరుగుదలను సూచిస్తుంది.

2023 ఆర్థిక సంవత్సరానికి రూ.7.5 లక్షల కోట్ల మూలధన వ్యయాన్ని బడ్జెట్ లో కేటాయించారని, ఇందులో 2022 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు 59.6 శాతానికి పైగా ఖర్చు చేసినట్లు సర్వే తెలిపింది. ఈ కాలంలో, మూలధన వ్యయం 60% కంటే ఎక్కువ వృద్ధిని నమోదు చేసింది, ఇది 2016 ఆర్థిక సంవత్సరం నుండి 2020 ఆర్థిక సంవత్సరం వరకు ఇదే కాలంలో నమోదైన దీర్ఘకాలిక సగటు వృద్ధి 13.5% కంటే చాలా ఎక్కువ. 2022 ఆర్థిక సంవత్సరంలో రోడ్డు రవాణా, రహదారులకు రూ.1.5 లక్షల కోట్లు, రైల్వేలకు రూ.1.20 లక్షల కోట్లు, రక్షణకు రూ.0.7 లక్షల కోట్లు, టెలికమ్యూనికేషన్లకు 0.3 లక్షల కోట్లు కేటాయించారు. ఇది మొత్తం డిమాండ్ ను బలోపేతం చేయడానికి, ఉపాధిని సృష్టించడానికి, ఇతర రంగాలకు ఊతమిచ్చే కౌంటర్-సైక్లికల్ ఆర్థిక సాధనంగా పరిగణించబడింది.

అన్ని దిశల నుంచి కాపెక్స్ ను పెంచడానికి, దీర్ఘకాలిక వడ్డీ లేని రుణాలు కాపెక్స్-లింక్డ్ అదనపు రుణ నిబంధనల రూపంలో రాష్ట్రాల మూలధన వ్యయాన్ని పెంచడానికి కేంద్రం అనేక ప్రోత్సాహకాలను ప్రకటించింది.

కేంద్ర ప్రభుత్వ రెవెన్యూ వ్యయాన్ని 2021 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 15.6 శాతం నుంచి 2022 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 13.5 శాతానికి తగ్గించారు.

2021 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 3.6 శాతంగా ఉన్న సబ్సిడీ వ్యయాన్ని 2022 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 1.9 శాతానికి తగ్గించడం ఈ వైరుధ్యానికి దారితీసింది. 2023 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 1.2 శాతానికి తగ్గించాలని నిర్ణయించారు. అయితే అకస్మాత్తుగా భౌగోళిక రాజకీయ సంఘర్షణ వ్యాప్తి చెందడం వల్ల ఆహారం, ఎరువులు, ఇంధనానికి అంతర్జాతీయ ధరలు పెరగడంతో 2022 ఏప్రిల్ నుండి నవంబర్ వరకు సబ్సిడీల కోసం బడ్జెట్ వ్యయంలో 94.7% ఉపయోగించబడింది. అందువల్ల, 2022 ఏప్రిల్ నుండి నవంబర్ వరకు ఆదాయ వ్యయం వై ఒ వి ప్రాతిపదికన 10% పైగా పెరిగింది, ఇది గత సంవత్సరం ఇదే కాలంలో నమోదైన వృద్ధి కంటే ఎక్కువ.

మహమ్మారి వ్యాప్తి తర్వాత రశీదుల నిష్పత్తి ప్రకారం వడ్డీ చెల్లింపులు పెరిగాయి. అయితే మధ్యకాలికంగా మనం ఆర్థిక ప్రగతి పథంలో పయనిస్తున్న కొద్దీ ఆదాయాలు పుంజుకోవడం, దూకుడుగా ఆస్తుల మానిటైజేషన్, సామర్థ్య లాభాలు, ప్రైవేటీకరణ వంటివి ప్రభుత్వ రుణాలను చెల్లించడానికి దోహదపడతాయని, తద్వారా వడ్డీ చెల్లింపులు తగ్గుతాయని, ఇతర ప్రాధాన్యతల కోసం ఎక్కువ నిధులు విడుదల అవుతాయని ఆర్థిక సర్వే పేర్కొంది.

రాష్ట్ర ప్రభుత్వ నిధుల అవలోకనం

2021 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 4.1 శాతానికి పెరిగిన రాష్ట్రాల ఉమ్మడి స్థూల ద్రవ్యలోటు (జీఎఫ్డీడి) ను 2022 ఆర్థిక సంవత్సరంలో 2.8 శాతానికి తగ్గించారు. భౌగోళిక రాజకీయ అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా, రాష్ట్రాల ఏకీకృత జి ఎఫ్ డి -జిడిపి నిష్పత్తి 2023 ఆర్థిక సంవత్సరంలో 3.4% గా బడ్జెట్ చేయబడింది. అయితే, 2022 ఏప్రిల్-నవంబర్ మధ్య, 27 ప్రధాన రాష్ట్రాల ఉమ్మడి రుణాలు సంవత్సరానికి వారి మొత్తం బడ్జెట్ రుణాలలో 33.5 శాతానికి చేరుకున్నాయి. రాష్ట్రాలు ఉపయోగించని రుణ పరిమితులను కలిగి ఉన్నాయని గత మూడేళ్ల గణాంకాలు చెబుతున్నాయి.

2022 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల మూలధన వ్యయం 31.7% పెరిగింది. రాష్ట్రాలకు ముందస్తు చెల్లింపులు, జీఎస్టీ పరిహార చెల్లింపులు, వడ్డీలేని రుణాల విషయంలో కేంద్రం అందించిన మద్దతు, బలమైన ఆదాయ ప్రోత్సాహం ఈ పెరుగుదలకు కారణం. రాష్ట్రాలకు బదలాయించిన కేంద్ర పన్నుల వాటా, ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాలు (సిఎస్ఎస్) ఇతర బదిలీలతో సహా రాష్ట్రాలకు మొత్తం బదిలీలు 2019 -2023 ఆర్థిక సంవత్సరం మధ్య పెరిగాయి. 2023 ఆర్థిక సంవత్సరానికి రూ.1.92 లక్షల కోట్లు కేటాయించాలని ఆర్థిక సంఘం సిఫారసు చేసింది.

## సంక్షోభ సమయంలో జీ ఎస్ టి పరిహారం చెల్లింపులు

రాష్ట్రాలకు జిఎస్ టి పరిహారంలో లోటును తీర్చడానికి, నిధి నుండి సాధారణ జిఎస్ టి పరిహారాన్ని విడుదల చేయడంతో పాటు, 2021 , 2022 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ. 2.69 లక్షల కోట్లను అప్పుగా తీసుకొని రాష్ట్రాలకు బదిలీ చేసింది. అంతేకాక, రాష్ట్రాలకు సెస్ చెల్లింపులు , పన్ను వికేంద్రీకరణ వాయిదాలు నిధులను త్వరగా పొందడానికి ముందు వరుసలో ఉన్నాయి. 2022 నవంబర్ వరకు మొత్తం సెస్ వసూళ్లు రాష్ట్రాలకు చెల్లించడానికి సరిపోనప్పటికీ, కేంద్రం తన వనరుల నుండి మిగిలిన మొత్తాన్ని విడుదల చేసింది.

మహమ్మారి వ్యాప్తి చెందినప్పటి నుండి, కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల నికర రుణ పరిమితిని ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ లెజిస్లేషన్ (ఎఫ్ఆర్ఎల్) పరిమితికి మించి ఉంచింది. 2021 ఆర్థిక సంవత్సరంలో జీఎస్డీపీలో 5 శాతం, 2022 ఆర్థిక సంవత్సరంలో జీఎస్డీపీలో 4 శాతం, 2023 ఆర్థిక సంవత్సరంలో జీఎస్డీపీలో 3.5 శాతంగా నిర్ణయించారు.'వన్ నేషన్ వన్ రేషన్ కార్డు' విధానం అమలు, సులభతర వ్యాపార సంస్కరణలు, పట్టణ స్థానిక సంస్థలు/ యుటిలిటీ సంస్కరణలు, విద్యుత్ రంగ సంస్కరణలు వంటి సంస్కరణల అమలుతో ఇది ముడి పెట్టారు. ఈ సంస్కరణల్లో వివిధ రాష్ట్రాలు సాధించిన పురోగతిని ఈ సర్వే గమనించింది. 2021, 2022 ఆర్థిక సంవత్సరాల్లో రూ.11,830 కోట్లు, 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.14,186 కోట్లను మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం పథకం కింద 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలుగా అందించింది. 2023 ఆర్థిక సంవత్సరంలో స్టేట్ కాపెక్స్ ప్రణాళికలకు మరింత ఊతమిచ్చేందుకు ఈ పథకం కింద కేటాయింపులను రూ.1.05 లక్షల కోట్లకు పెంచారు

## ప్రభుత్వ రుణ స్థితి

2022 లో ప్రపంచ ప్రభుత్వ రుణం జిడిపిలో 91% ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది, ఇది మహమ్మారికి ముందు స్థాయిల కంటే 7.5% పాయింట్లు ఎక్కువ. ఈ ప్రపంచ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మొత్తం అప్పులు 2021 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 59.2 శాతం నుంచి 2022 ఆర్థిక సంవత్సరంలో 56.7 శాతానికి తగ్గాయి.

భారతదేశ ప్రభుత్వ రుణ స్థితి (పబ్లిక్ డెట్ ప్రొఫైల్) సాపేక్షంగా స్థిరంగా ఉంది తక్కువ కరెన్సీ ,వడ్డీ రేటు నష్టాలను కలిగి ఉంటుంది. 2021 మార్చి చివరి నాటికి కేంద్ర ప్రభుత్వ మొత్తం నికర అప్పుల్లో 95.1% దేశీయ కరెన్సీలో ఉండగా, సార్వభౌమ బాహ్య రుణం 4.9%, ఇది తక్కువ కరెన్సీ ప్రమాదాన్ని సూచిస్తుంది.

అంతేకాకుండా, సార్వభౌమ విదేశీ రుణం పూర్తిగా అధికారిక వనరుల నుండి వస్తుంది, ఇది అంతర్జాతీయ మూలధన మార్కెట్లలో అస్థిరత నుండి రక్షిస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది.

ఇంకా, భారతదేశంలో ప్రభుత్వ రుణం ప్రధానంగా స్థిర వడ్డీ రేట్ల వద్ద కుదించబడుతుంది, ఫ్లోటింగ్ అంతర్గత రుణం 2021 మార్చి చివరి నాటికి జిడిపిలో 1.7% మాత్రమే ఉంటుంది. అందువల్ల డెట్ పోర్ట్ ఫోలియో వడ్డీరేట్ల అస్థిరత నుంచి రక్షణ పొందుతుంది. మహమ్మారి కారణంగా కేంద్రం, రాష్ట్రాలు చేసిన అదనపు అప్పుల కారణంగా 2021 ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో నిష్పత్తిగా సాధారణ ప్రభుత్వ అప్పులు భారీగా పెరిగాయి. అయితే ఈ నిష్పత్తి 2022 ఆర్థిక సంవత్సరం (ఆర్ఈ)లో గరిష్ట స్థాయికి పడిపోయిందని ఆర్థిక సర్వే పేర్కొంది. జిడిపిలో శాతంగా సాధారణ ప్రభుత్వ లోటులు కూడా ఎఫ్ 21 లో గరిష్ట స్థాయికి చేరుకున్న తర్వాత ఏకీకృతమయ్యాయి.

ఇటీవలి సంవత్సరాల్లో కాపెక్స్ కు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రైవేటు వినియోగ వ్యయాలు, ప్రైవేటు పెట్టుబడులపై గుణక ప్రభావాల ద్వారా జీడీపీ వృద్ధి పెరుగుతుందని సర్వే పేర్కొంది. అధిక జిడిపి వృద్ధి తద్వారా మధ్యకాలికంగా ఉత్సాహభరితమైన ఆదాయ సేకరణకు దోహదపడుతుంది, స్థిరమైన ఆర్థిక మార్గాన్ని అనుమతిస్తుంది. సాధారణ ప్రభుత్వ రుణం , జిడిపి నిష్పత్తి లో 2020 మార్చి చివరి నాటికి 75.7% నుండి 2021 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 89.6% కి పెరిగింది. ఇది 2022 మార్చి చివరి నాటికి జీడీపీలో 84.5 శాతానికి పడిపోతుందని అంచనా. కాపెక్స్ ఆధారిత వృద్ధికి ప్రాధాన్యమివ్వడం వల్ల వృద్ధి-వడ్డీ రేటు వ్యత్యాసాన్ని సానుకూలంగా ఉంచడానికి భారత దేశానికి వీలవుతుంది.

సానుకూల వృద్ధి-వడ్డీ రేటు వ్యత్యాసం రుణ స్థాయిలను స్థిరంగా ఉంచుతుంది.

2005 నుండి 2021 వరకు జిడిపి నిష్పత్తిలో సాధారణ ప్రభుత్వ రుణం మార్పు దేశాలలో గణనీయంగా ఉంది. 2005లో జీడీపీలో 81 శాతంగా ఉన్న భారత్ కు సంబంధించి తి2021 నాటికి జీడీపీలో 84 శాతానికి పెరిగింది.

గత 15 సంవత్సరాలలో స్థితిస్థాపక ఆర్థిక వృద్ధి కారణంగా ఇది సాధ్యమైందని, ఇది సానుకూల వృద్ధి-వడ్డీ రేటు వ్యత్యాసానికి దారితీసిందని, ఫలితంగా జిడిపి స్థాయిలకు స్థిరమైన ప్రభుత్వ రుణం లభించిందని ఆర్థిక సర్వే వివరించింది.

# పాకిస్తాన్ డ్రోన్‌ను కూల్చివేసిన బీఎస్ఎఫ్ దళాలు

న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : పంజాబ్‌లోని అమృత్‌సర్ జిల్లాలో భారత భూభాగంలోకి ప్రవేశించిన పాకిస్తాన్ డ్రోన్‌ను బీఎస్ఎఫ్ దళాలు కూల్చివేశాయి. ఆ డ్రోన్ ద్వారా పంపిన మాదక ద్రవ్యాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో అమృత్‌సర్ జిల్లాలోని కక్కర్ గ్రామ సమీపంలో డ్రోన్ సంచరిస్తున్న శబ్దం వినిపించింది. దీంతో బీఎస్ఎఫ్ దళాలు అప్రమత్తమయ్యాయి. పాక్ నుంచి భారత్‌లోకి ప్రవేశించిన ఆ డ్రోన్‌ను బలగాలు కూల్చేశాయి. డ్రోన్‌తో పాటు 5 కిలోల హెరాయిన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో బలగాలు ఇతర ఏజెన్సీలను అప్రమత్తం చేశాయి.

# ఊరంత కుటుంబం..12 మంది భార్యలు, 102 మంది పిల్లలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:12 మంది భార్యలు..102 పిల్లలు.. ఇక 578 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. తన పిల్లల పేర్లలో చాలా పేర్లు అతనికి తెలియదు. ఇది విచిత్రంగా ఉంది కదూ..? అవును.. ఇది నిజం. ఉంగాండాలోని బుటాలేజా ప్రాంతంలో నివసించే మూసా హసహ్య కసెరా కథ ఇది. మొదట్లో ఎక్కువ ఎక్కువమంది భార్యలు, సంతానం, మనవళ్లు ఉన్నారనే విషయం చాలా సరదాగా ఉండేది. కాని ఇది ప్రస్తుతం నాకు పెద్ద సమస్యగా ఉంది. నా ఆరోగ్యం క్షీణించింది.. ఇంత పెద్ద కుటుంబాన్ని పోషించాలంటే మాటలు కాదు. సరైన ఆహారం, విద్య, దుస్తులు వంటి ప్రాథమిక వస్తువులను సైతం ఇవ్వలేకపోతున్నానని మూసా వాపోతున్నాడు. సరిగా పోషించడం లేదని ఇద్దరు భార్యలు విడిచిపోయారని చెప్పాడు.

ప్రస్తుతం ఇతను నిరుద్యోగి.. ఎలాంటి ఆదాయం లేదు. అయితే, మూసా ఇప్పుడు తన గ్రామంలో సెలబ్రిటీగా మారాడు. ఇప్పుడు భార్యలు బర్త్ కంట్రోల్‌ను పాటిస్తున్నాని మీడియాకు తెలిపాడు. బుగిసా గ్రామంలో మూసా తన కుటుంబంతో నివాసముండే ఇల్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులు ఊడిపోయిన పైకప్పు, తుప్పు పట్టిన ఇనుప గేట్లు.. చుట్టపక్కలా దట్టంగా విస్తరించిన దట్టమైన పొదళ్లతో ఉంది. తన మొదటి భార్యను మూసా 1972లో సంప్రదాయబద్ధంగా వివాహం చేసుకున్నాడని మీడియాకు తెలిపాడు. అప్పుడు వారిద్దరికి 17 ఏళ్లు. ఏడాది తర్వాత తమ ప్రథమ సంతానం సాండ్రా నాబ్‌వైర్ జన్మించాడు. నా కుటుంబ వారసత్వాన్ని విస్తరించడానికి చాలా మంది పిల్లలను కనాలని, అందుకు చాలా మంది భార్యలను పెళ్లాడాలని తన బంధుమిత్రులు సలహా ఇవ్వడంతో ఈ కార్యాన్ని ప్రారంభించానని మూసా వెల్లడించాడు. యుక్త వయసులో మూసా హసహ్య పశువులు, మాంసాన్ని విక్రయించే వ్యాపారం చేసేవాడు. ఉగాండాలో 1955లో బాల్య వివాహాలు మాత్రమే నిషేధించారు. అయితే, తూర్పు ఆఫ్రికా దేశాల్లో కొన్ని మత సంప్రదాయాల ప్రకారం బహుభార్యత్వానికి అనుమతి ఉంది. 102 మంది సంతానంలో 10 నుంచి 50 ఏళ్ల వయసు వాళ్లు ఉన్నారు. ఇతని చిన్న భార్య వయసు 35 ఏళ్లు. నా పిల్లల పేర్లను గుర్తించడంలో నా భార్యలు అంటే పిల్లల తల్లులు సహాయపడతారని అంటాడితను. అంతే కాదు మూసాకు చాలా మంది భార్యల పేర్లు కూడా గుర్తులేవు. అలాంటప్పుడు అతను తన పిల్లలను అడిగి తెలుసుకుంటాడట. తన సంతానంలోని విద్యను అభ్యసించిన కొద్దిమందిలో 30 ఏళ్ల షాబాన్ మగినో ఒకడు. ఇతను స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన భార్యలు తనని ప్రేమిస్తారని అందుకే ఇంకా తనతో పాటే ఉంటున్నారని అంటాడు మూసా హసహ్య కసెరా.

# 2022-23 సంవత్సరానికి 35.4 శాతం మేర పెరిగిన మూలధన వ్యయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:మౌలిక సదుపాయాల పెట్టుబడుల పెరుగుదల ఆర్థిక వ్యవస్థ యొక్క సంభావ్య వృద్ధికి కీలకమైన తోడ్పాటును అందిస్తుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం మూలధన వ్యయాన్ని పెంచుతూపోతోంది. 2022-23 (బడ్జెట్ అంచనా)లో మూలధన వ్యయం వేగంగా పెరిగింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2021-22) రూ.5.5 లక్షల కోట్లుగా ఉన్న ఈ వ్యయం 2022-23 సంవత్సరంలో ఇప్పటికే 35.4 శాతం పెరిగి నుండి 7.5 లక్షల కోట్లకు చేరింది. ఇందులో దాదాపు 67 శాతం ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు ఖర్చు చేసినదే ఉండడం విశేషం. 2022 ఆర్థిక సర్వే 2022-23ని ఈ రోజు పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతినిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. " ఇటీవలి కాలంలో ప్రయివేటు రంగం మూలధన వ్యయం తగ్గిపోయిన సంక్షోభ సమయంలో కూడా ప్రభుత్వం మూలధన వ్యయాన్ని పెంపొందించడం ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు పెట్టుబడులకు అధిక ప్రోత్సాహాన్ని అందించింది" అని ఆర్థిక సర్వే డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్: లిఫ్టింగ్ పొటెన్షియల్ గ్రోత్ అనే తన అధ్యాయంలో పేర్కొంది. మౌలిక వసతుల పెట్టుబడులను పెంచేందుకు నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ అవసరమైన ప్రోత్సాహాన్ని అందజేస్తోందని పేర్కొంది. నేషనల్ లాజిస్టికల్ పాలసీ సేవలు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు లాజిస్టిక్స్ వర్క్‌ఫోర్స్‌లోని నైపుణ్యాలలో అంతరాలను పరిష్కరిస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇంకా పీఎం గతిశక్తి మల్టీమోడల్ విధానంతో భౌతిక మౌలిక వసతుల అవస్థాపనలో ఖాళీలను పూరించడానికి మరియు వివిధ ఏజెన్సీలలో యొక్క ఇప్పటికే ఉన్న, ప్రతిపాదిత మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలను ఏకీకృతం చేయడానికి రూపొందించబడిందని పేర్కొంది. భౌతిక మౌలిక వసతుల కల్పనకు సుదీర్ఘ కాలం పాటు నిరంతర మద్దతు అవసరమవుతుంది. కావున ప్రభుత్వం మేటి పెట్టుబడి చక్రంలో చలనం కోసం అభివృద్ధి ఆర్థిక సంస్థగా 'నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్' (ఎన్‌బీబీఎఫ్ఐడీ)ని కూడా ఏర్పాటు చేసింది. భారత ప్రభుత్వంలోని అన్ని సంబంధిత మంత్రిత్వ శాఖలు/ డిపార్ట్‌మెంట్లలో ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ సెల్స్ (పీడీసీలు) రూపంలో పెట్టుబడులను త్వరితగతిన ట్రాక్ చేయడానికి ఒక సంస్థాగత యంత్రాంగం ఏర్పాటు చేయబడిందని ఆర్థిక సర్వే పేర్కొంది.

## ప్రభుత్వ -ప్రైవేట్ భాగస్వామ్యాలు (పీపీపీలు)

పీపీపీలు ప్రభుత్వాలకు కీలకమైన పెట్టుబడి సాధనాలు. మౌలిక సదుపాయాల కీలకమైన రంగాలలో ప్రైవేట్ రంగం యొక్క సామర్థ్యాన్ని చానెల్ చేయడంలో పీపీపీ ఎంతగానో దోహదం చేస్తుందని ఆర్థిక సర్వే పేర్కొంది. 2015 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 ఆర్థిక సంవత్సరం వరకు రూ.2,27,268.1 కోట్ల మొత్తం ప్రాజెక్ట్ వ్యయంతో కూడిన 79 ప్రాజెక్ట్‌లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ అప్రైజల్ కమిటీ అనుమతులను మంజూరు చేసింది. ఆర్థికంగా లాభదాయకం కాని సామాజికంగా/ ఆర్థికంగా కావాల్సిన పీపీపీ ప్రాజెక్ట్‌లకు ఆర్థిక సహాయం అందించడానికి, ఆర్థిక వ్యవహారాల శాఖ 2006లో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) పథకాన్ని ప్రారంభించిందని ఆర్థిక సర్వే పేర్కొంది. 2014-15 నుండి 2022-23 వరకు, వీజీఎఫ్ పథకం కింద , రూ.57870.1 కోట్ల టీపీసీతో 56 ప్రాజెక్ట్‌లకు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ?25263.8 కోట్ల టీపీసీతో 27 ప్రాజెక్ట్‌లకు ?5813.6 కోట్ల మొత్తంతో (భారత ప్రభుత్వం ఉ రాష్ట్రం వాటా షేర్ రెండూ)వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఆమోదంతో తుది ఆమోదం పొందాయి. 2015 నుండి 2023 వరకు ఈ పథకం కింద డీఈఏ పంపిణీ చేయబడిన వీజీఎఫ్ మొత్తం ?2982.4 కోట్లు. దీనికి తోడు పీపీపీ ప్రాజెక్టల ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం కోసం 'ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ స్కీమ్' (ఐఐపీడీఎఫ్) - అనే పథకం రూ.150 కోట్లతో 3 నవంబర్ 2022న ప్రభుత్వం నోటిఫై చేసింది. 2023 నుండి 2025 మూడేండ్ల కాల పరిమితితో దీనిని నోటిఫై చేసినట్టుగా ఆర్థిక సర్వే పేర్కొంది.

## నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్

ప్రభుత్వం జాతీయ మౌలిక సదుపాయాల పైప్‌లైన్ (ఎన్ఐపీ)ను ముందుకు చూపు విధానంతో ప్రారంభించింది. దీనిలో భాగంగా దేశ వ్యాప్తంగా అధిక నాణ్యత గల మౌలిక సదుపాయాలను అందించడానికి 2020-2025 సమయంలో సుమారు రూ.111 లక్షల కోట్ల మౌలిక సదుపాయాల పెట్టుబడిని అంచనా వేసింది. ఎన్ఐపీ ప్రస్తుతం 8,964 ప్రాజెక్ట్‌లను కలిగి ఉంది. మొత్తం ?108 లక్షల కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడితో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల అమలు వివిధ దశలలో ఉన్నాయి. ఎన్ఐపీ మరియు ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (పీఎంజీ) పోర్టల్‌లను ఏకీకృతం చేయాలని ప్రతిపాదించబడింది.

## నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ - మానిటైజేషన్ ద్వారా సృష్టి

ఆర్థిక సర్వే నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపీ)ని ప్రస్తావిస్తూ, 'నగదీకరణ (మానిటైజేషన్) ద్వారా ఆస్తుల సృష్టి' అనే సూత్రంపై 23 ఆగస్టు 2021న దీనిని ప్రకటించినట్లు ఆర్థిక సర్వే పేర్కొంది. 2020-2025 ఆర్థిక సంవత్సరాల వ్యవధిలో, కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆస్తుల ద్వారా ఎన్ఎంపీ కింద అంచనా వేసిన మొత్తం నగదీకరణ సంభావ్యత రూ.6 లక్షల కోట్లు. 2022 ఆర్థిక సంవత్సరంలో నగదీకరణ లక్ష్యం ?0.9 లక్షల కోట్లు. దీనికి గాను రోడ్లు, విద్యుత్, బొగ్గు మరియు గనుల కింద ?0.97 లక్షల కోట్లు నగదీకరణ సాధించబడింది.

## నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ: లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గించడం

లాజిస్టిక్స్ వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం 'ఉడే దేశ్ కా ఆమ్ నాగ్రిక్' (ఉడాన్), భారతమాల, సాగరమాల, పర్వతమాల, జాతీయ రైలు ప్రణాళిక వంటి 'మౌలిక సదుపాయాల కార్యక్రమాల' లను జీఎస్టీ, ఈ-సంచిత్, సింగిల్ విండో ఇంటర్‌ఫేస్ ఫర్ ట్రేడ్ (స్విఫ్ట్), ఇండియన్ కస్టమ్స్ ఎలక్ట్రానిక్ డేటా ఇంటర్‌చేంజ్ గేట్‌వే (ఐసీఈ గేట్), తురంత్ కస్టమ్స్ వంటి పలు ఇతర సంస్కరణలను భారత ప్రభుత్వం ఇప్పటికే అనేక ప్రయత్నాలలో చేపట్టిందని సర్వే పేర్కొంది. వివిధ ప్రభుత్వ సంస్థల ద్వారా ఈ ప్రయత్నాలన్నింటినీ ఏకీకృతం చేయడానికి 17 సెప్టెంబర్ 2022న నేషనల్ లాజిస్టిక్స్ పాలసీ ప్రారంభించబడింది, లాజిస్టిక్స్‌లో సామర్థ్యాన్ని మెరుగుపరిచే భాగాలను ప్రస్తావిస్తూ ఆర్థిక సర్వే పేర్కొంది.

## భౌతిక మౌలిక వసతుల రంగాలలో అభివృద్ధి-రోడ్డు రవాణ

ఆర్థిక సర్వే ప్రకారం, కాలక్రమేణా జాతీయ రహదారులు (ఎన్.హెచ్.ల)/ రోడ్ల నిర్మాణంలో పెరుగుదల నమోదవుతూ వస్తోంది, 2016 ఆర్థిక సంవత్సరంలో 6,061 కి.మీ.తో పోలిస్తే 20022 ఆర్థిక సంవత్సరంలో 10,457 కి.మీ. మర రోడ్లు నిర్మించబడ్డాయి. ఈ రంగంలో పెట్టుబడికి మొత్తం బడ్జెట్ మద్దతు గత నాలుగు సంవత్సరాలలో వేగంగా పెరుగుతూ వస్తోంది. 2023 ఆర్థిక సంవత్సరంలో (31 అక్టోబర్ 2022 నాటికి) ఇది సుమారు ?1.4 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రభుత్వ రంగ ఆస్తుల మోనటైజేషన్ దృష్టి కోణానికి అనుగుణంగా 'నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా' (ఎన్.హెచ్.ఎ.ఐ) 2022 ఆర్థిక సంవత్సరంలో తన ఇన్విట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు ఔఱంఎ ఇన్విట్ అధిక నాణ్యత గల విదేశీ మరియు భారతీయ సంస్థాగత పెట్టుబడిదారుల నుండి (డిసెంబర్ 2022 వరకు) రూ.10,200 కోట్లకు పైగా నిధులను సమీకరించింది.

కోవిడ్-19 ప్రభావం ఉన్నప్పటికీ భారతీయ రైల్వేలు (ఐఆర్) సరుకు రవాణాను కొనసాగించాయి. 2022-23లో (నవంబర్ 2022 వరకు), ఐఆర్ 976.8 మిలియన్ టన్నుల ఆదాయాన్ని ఆర్జించేలా సరుకు రవాణాను (కె.ఆర్.సి.ఎల్ మినహాయించి) చేపట్టింది. 2021-22లో (కె.ఆర్.సి.ఎల్. మినహాయించి) సంబంధిత కాలంలో 901.7 మిలియన్ టన్నుల రవాణా చేపట్టింది, ఇది. 8.3 శాతం పెరుగుదలను సూచిస్తోందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇంకా, రైల్వేలో మౌలిక సదుపాయాలపై మూలధన వ్యయం (క్యాపెక్స్) గత నాలుగు సంవత్సరాలలో నిరంతర పెరుగుదలను నమోదు చేస్తోంది. 2023లో క్యాపెక్స్ (బి.ఇ.) ?2.5 లక్షల కోట్లకు చేరి గత సంవత్సరంతో పోలిస్తే దాదాపు 29 శాతం పెరిగింది. ముంబయి అహ్మదాబాద్ హై-స్పీడ్ రైల్ ప్రాజెక్ట్, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ప్రాజెక్ట్, గతి శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్, వందే భారత్ రైళ్లను అందుబాటులోకి తేవడం, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ సిస్టమ్, హైపర్‌లూప్ టెక్నాలజీ అభివృద్ధి మరియు త్వరగా పాడైపోయే పదార్థాల వేగంగా తరలింపును 2021 ఆర్థిక సంవత్సరంలో అమలులోకి తెచ్చిన కిసాన్ రైళ్లను ప్రవేశపెట్టడం భారతీయ రైల్వేల పరిధిలోని ప్రధాన కార్యక్రమాలుగా నిలిచాయని ఆర్థిక సర్వే పేర్కొంది.

ఆర్థిక సర్వే ప్రకారం డిసెంబర్ 2022లో విమానయానం చేసిన మొత్తం ప్రయాణికుల సంఖ్య 150.1 లక్షలుగా ఉంది, ఇది కోవిడ్‌కు ముందు ఉన్న స్థాయితో పోలిస్తే (ఏప్రిల్ 2019 నుండి ఫిబ్రవరి 2020 వరకు 11 నెలల సగటు) 106.4 శాతం. నవంబర్ 2022లో మొత్తం ఎయిర్ కార్గో టన్నేజ్ 2.5 లక్షల మెట్రిక్‌టనులుగా ఉంది, ఇది కోవిడ్‌కు ముందు ఉన్న స్థాయిలతో పోలిస్తే 89 శాతం.మార్చి 2014 చివరి నాటికి సంవత్సరానికి 871.5 మిలియన్ టన్నులగా (ఎం.టి.పి.ఎ) ఉన్న ప్రధాన పోర్టుల సామర్థ్యం, మార్చి 2022 చివరి నాటికి 1534.9 ఎం.టి.పి.ఎ.కి పెరిగింది. 2022 సమయంలో ఇది సంచితంగా 720.1 ఎంటీ ట్రాఫిక్‌ను నిర్వహించాయని ఆర్థిక సర్వే పేర్కొంది. వారి సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడానికి, ప్రభుత్వం పోర్ట్ గవర్నెన్స్‌ను మెరుగుపరచడం, తక్కువ-సామర్థ్య వినియోగాన్ని పరిష్కరించడం, టెక్నో ఎఫెక్టివ్ లోడింగ్/ అన్‌లోడ్ చేసే పరికరాలతో బెర్త్‌లను ఆధునీకరించడం మరియు పోర్ట్ కనెక్టివిటీ కోసం కొత్త ఛానెల్‌లను రూపొందించడంవంటి పనులపై దృష్టి సారిస్తోంది. పోర్ట్ సమ్మతిని క్రమబద్ధీకరించడం కోసం మరియు ఓడల కోసం టర్న్ ఎరౌండ్ టైమ్ (టీఏటీ)ని తగ్గించడం కోసం, కీలకమైన ఎగ్జిమ్ ప్రక్రియల డిజిటలైజేషన్ వైపు ప్రధాన ఓడరేవుల్లో సుదీర్ఘ ప్రగతిని ఎకనామిక్ సర్వే గమనిస్తోందని పేర్కొంది.

టెక్నో-ఎకనామిక్ సాధ్యత మరియు వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికల (డీపీఆర్లు) ఫలితాల ఆధారంగా, కార్గో తరలింపు కోసం 26 జాతీయ జలమార్గాలకు ప్రాధాన్యమివ్వబడింది. వీటిలో 14 అత్యంత ఆచరణీయమైన ఎన్.డబ్ల్యులలో అభివృద్ధి కార్యకలాపాలు ప్రారంభించబడ్డాయి అని ఆర్థిక సర్వే పేర్కొంది. జాతీయ జలమార్గాలపై కార్గో రవాణా ఉద్యమం 2022లో ఆల్-టైమ్ గరిష్ట స్థాయికి చేరింది. ఈ కాలంలో 108.8 మిలియన్ టన్నుల లక్ష్యానికి చేరుకుంది. అంటే గత సంవత్సరంతో పోలిస్తే 30.1 శాతం వృద్ధిని నమోదు చేసినట్లయిందని ఆర్థిక సర్వే పేర్కొంది.మార్చి 31, 2022 నాటికి దేశంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలు మరియు క్యాప్టివ్ పవర్ ప్లాంట్ల మొత్తం స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 482.2 గిగా వాట్లుగా ఉంది, ఇది 31 మార్చి 2021న 460.7 గిగా వాట్లుగా మాత్రమే ఉంది, అంటే ఈ విభాగం సామర్థ్యం 4.7 శాతం మేర పెరిగింది. 31 మార్చి 2022 నాటికి యుటిలిటీస్‌లో ఇన్‌స్టాల్ చేయబడిన సామర్థ్యం 399.5 గిగా వాట్లుగా ఉంది, ఇది ఆర్థిక సర్వే గమనికల ప్రకారం ఒక సంవత్సరం క్రితం 382.1 గిగా వాట్లు (4.5 శాతం ఎక్కువ). విద్యుత్ ఉత్పత్తి సంస్థల మొత్తం స్థాపిత సామర్థ్యంలో థర్మల్ విద్యుత్త అతిపెద్ద (59.1 శాతం) వాటాను కలిగి ఉంది, తర్వాత అతిపెద్ద వాటాను 27.5 శాతంతో పునరుత్పాదక ఇంధన వనరులు, 11.7 శాతంతో హైడ్రో విద్యుత్తులు నిలిచాయి. 2022 మరియు 2021 ఆర్థిక సంవత్సరాల మధ్య పునరుత్పాదక ఇంధన వనరులలో విద్యుత్ ఉత్పత్తిలో గరిష్ట పెరుగుదల నమోదైంది. 2030 నాటికి నాన్-ఫాసిల్ ఫ్యూయల్ ఆధారిత ఇంధన వనరుల నుండి విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయడానికి 50 శాతం సంచిత స్థాపిత సామర్థ్యాన్ని సాధించాలని భారతదేశం లక్ష్యంగా పెట్టుకుంది. పీఎం-కుసుమ్, సోలార్ పార్క్ స్కీమ్ మరియు ఇతర పథకాల ద్వారా భారతదేశ ఇంధన రంగంలో సాంప్రదాయిక వనరుల నుండి శిలాజ రహిత ఇంధన వనరులకు క్రమంగా మార్పు చెందుతూ కాలుష్య నివారణ విషయంలో భారతదేశం తన కట్టుబాట్లను నెరవేర్చే మార్గంలో ముందుకు సాగుతోందని ఆర్థిక సర్వే పేర్కొంది. ప్రభుత్వ మద్దతుతో, ప్రైవేట్ రంగం మొత్తం ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో మరియు తక్కువ వ్యవధిలో యూనిట్ ఖర్చులను తగ్గించడంలో చురుకుగా ముందుకు సాగుతోందని సర్వే పేర్కొంది

# ఫిష్' ప్రెన్యూర్స్!.. మహిళలకు కొత్తకొత్త వంటకాల తయారీలో శిక్షణ




హైదరాబాద్ ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నైపుణ్యాన్ని ఓ వ్యాపార అవకాశంగా మలుచుకుంటే.. ఆర్థిక స్వావలంబన సాధ్యం. ఆ ఉద్దేశంతోనే మత్స్యశాఖ మహిళలకు కొత్తకొత్త వంటకాల తయారీలో శిక్షణ ఇస్తున్నది. స్టాక్' బోర్డులు! చేపల వంటకాలను ఉపాధిగా చుకోవాలనుకునే ఫిష్ ప్రెన్యూర్స్కు మత్స్యశాఖ అండ 0డలు అందిస్తున్నది. చేపల వంటకాలతో మహిళలకు యం ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నది. దులో భాగంగా ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నది. నేషనల్ -స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్ ట్(నిథమ్ )తో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకుంది. ద శిక్షణ పొందిన వారికి మత్స్యశాఖ ఆధ్వర్యంలో -ధి మార్గాలను చూపిస్తారు. రాజేంద్రనగర్ లోని మ్ క్యాంపస్లో మత్స్య పాకశాస్త్రంలో పాఠాలు బోధి . ఒక్కో బ్యాచ్లో 30 నుంచి 40 మంది చొప్పునమొత్తం 20 బ్యాచ్లలో సుమారు 700 మందికి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం సబ్సిడీపై మొబైల్ ఫిష్ అవుట్లెట్స్ సమకూరుస్తారు. ఇప్పటికే హైదరాబాద్లో 150 వరకు మొబైల్ ఫిష్ అవుట్లెట్స్ ఏర్పాటయ్యాయి. రద్దీ ఎక్కువగా ఉం స్థాపుల్లో కూడా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫిష్ స్టా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది తెలంగాణ సం ఆసక్తి ఉన్నవారు సంబంధిత జిల్లా మత్స్య శాఖ ఆ లను కానీ, హైదరాబా ద్లోని మత్స్యశాఖ ఆఫీసు కానీ సంప్రదించవచ్చు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా,మత్స్య సహాయ సంచాలకులు ఎం. చరిత మాట్లాడుతూ జిల్లా లోని మహిళను ప్రోత్సాహిస్తూ చేప విలువ ఆధారిత ఉత్పత్తులు గురించి నేషనల్ ఇన్సిట్యూట్ ఫ్ టూ రిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజి మెంట్ క్యాంపస్ లో మూడు రోజులు శిక్షణ కార్యక్రమాలు జరిగాయి అందులో భాగంగా అంబర్ నగర్ నుండి నిర్మల ముది రాజ్,దీపిక, పాల్గొనడం జరిగింది .

# ఆయుష్ మెడికల్ ఆఫీసర్ల నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం....!

## -జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్.

సంగారెడ్డి, ఫిబ్రవరి 03(నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆయుష్ మెడికల్ ఆఫీసర్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 9 ఆయుష్ మెడికల్ ఆఫీసర్ల పోస్టులను సంవత్సర కాలానికి కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ఆయుర్వేదిక్ 5 పోస్టులు, హోమియోపతి నాలుగు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ఇట్టి పోస్టులకు బిఎఎంఎస్/ బిహెచ్ఎంఎస్ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇండియన్ మెడిసిన్ బోర్డ్ లో నమోదై ఉండాలని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఈనెల 22 నుండి 27 వరకు దరఖాస్తుల స్క్రూటీని జరుగుతుందని, 28న ప్రొవిజినల్ మెరిట్ లిస్టు నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారని, అభ్యంతరాలను స్వీకరిస్తారని,

మార్చి,6న ఫైనల్ సెలక్షన్ లిస్ట్ ను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మార్చి 8న కౌన్సిలింగ్ నిర్వహించి నియామక ఉత్తర్వులు జారీ చేస్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 20 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులకు, గైడ్లైన్స్ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వెబ్సైట్ నుండి పొందవచ్చని సూచించారు.

# ఘనంగా శివదీక్ష మహా పడిపూజ

చౌటుప్పల్, ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి బాలాజీ దేవాలయ ఆవరణలో వేద పండితులమంత్రోచ్ఛరణల మధ్య శివ దీక్ష మండల ద్వాదశ జ్యోతిర్లింగాల శివదీక్ష మహా పడిపూజ శివ భక్తులు అత్యంత వైభవంగా చేశారు. శివునికి పంచామృత అభిషేకాలు జరిపించారు. లక్ష బిల్వార్చన పుష్పాలతో పూజ చేయించారు. అనంతరము ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడి వెలిగించడం జరిగింది. తదుపరి పాలకూర శివయ్య ఫౌండేషన్ చైర్మన్ పాల కూర్ల మురళి భాను దంపతులు భక్తులకు మా అన్న ప్రసాదం జరిపించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .ఆలయ ప్రాంగణంలో మొత్తం భక్తుల శివ నామస్మరణతో మారుమోగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు , సర్వ సంపదలతో ప్రజలు ధర్మం మార్గంలో భక్తి మార్గంలో ప్రయాణిస్తే భగవంతుని అనుగ్రహం తప్పక సిబ్బంది సిద్ధిస్తుందని అన్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చలమల కృష్ణారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బొల్లా శివశంకర్, శివ స్వాములు ఆదిములు శంకర్, కుక్కల నరసింహ,కోయిల కృష్ణ, తిగుల్ల వెంకటేశం, జ్యోతి రమేష్, వీరమల్ల దాసు, అశోక్, మధుసూదన్, సదానందం, సంతోష్ కుమార్, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.



# వైసిపి పార్టీ పరిణామాలపై రఘురామకృష్ణరాజు సంచలన వ్యాఖ్యలు

అమరావతి ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఏపీలో తమ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై నరసాపురం వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో నరసాపురం నుంచి గెలిచిన రఘురామ ఆ తర్వాత కొద్ది రోజులకే వైసీపీకి దూరమయ్యారు. అప్పటి నుంచి వివిధ మీడియా చానెళ్లలో సోషల్ మీడియాలో యూట్యూబు చానెళ్లలో సంచలన వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో రఘురామపై జగన్ ప్రభుత్వం రాజద్రోహం కింద కేసులు పెట్టి ఆయనను అరెస్టు చేయించింది. అంతేకాకుండా తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని రఘురామకృష్ణరాజు ఆరోపించడం కలకలం రేపింది. ఆ కేసులో బెయిల్ లభించడంతో రఘురామ అప్పటి నుంచి హైదరాబాద్ లోనే ఉంటున్నారు.కాగా నెల్లూరులో ఆనం రామనారాయణరెడ్డి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిల వ్యవహారంలో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ఆ పార్టీ ఎంపీ రఘురామ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఏపీలో తమ పార్టీలో అవమానాలు దిగమింగుకుంటూ ఉన్నవాళ్లంతా ఆత్మగౌరవంతో తిరగబడే రోజులు మొదలయ్యాయని స్పష్టం చేశారు. ఈ మేరకు తాజా పార్లమెంటు సమావేశాల కోసం ఢిల్లీలో ఉన్న రఘురామ మీడియాతో మాట్లాడారు.నెల్లూరు జిల్లాలో ఒకే సామాజికవర్గానికి చెందిన ముగ్గురు ప్రజాప్రతినిధులతో వైసీపీలో తిరుగుబాటు ప్రారంభమైందని అభివర్ణించారు.మరోవైపు పార్లమెంట్ చట్టం ద్వారానే ఏపీ రాజధాని మార్పు సాధ్యమని ఎట్టకేలకు మాజీ మంత్రి కొడాలి నాని గ్రహించారని రఘురామ హాట్ కామెంట్స్ చేశారు. సుప్రీంకోర్టులో మూడు రాజధానులకు అనుకూలంగా తీర్పు రాకపోతే రానున్న ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాలు 25 పార్లమెంటు స్థానాలు గెలుచుకొని కేంద్రంతో పార్లమెంట్లో బిల్లు పెట్టించి విశాఖను రాజధానిగా చేస్తామంటూ కొడాలి నాని పేర్కొన్నారని రఘురామ గుర్తుచేశారు.గౌతమ్ అదానీ ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఎదిగారని జగన్తో స్నేహం తర్వాత ఆయన కంపెనీ షేర్లు కుప్పకూలిపోయాయని రఘురామరాజు వెల్లడించారు.కాగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిన్ డీవై చంద్రచూడ్కు రఘురామకృష్ణరాజు లేఖ రాసిన సంగతి తెలిసిందే. విశాఖ రాజధాని అంటూ సీఎం జగన్ ప్రకటన చేసి కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని ఆ లేఖలో రఘురామ ఆరోపించారు. రాజధాని అంశంపై సుప్రీంకోర్టులో విచారణ సాగుతోందని.. విచారణకు వచ్చే సమయంలో ముఖ్యమంత్రి జగన్ ఈ వ్యాఖ్యలు చేశారని ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు.సీఎం జగన్ ఇలా వ్యాఖ్యానించడం నియమ నిబంధనల ప్రకారం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని రఘురామ ఆ లేఖలో పేర్కొన్న సంగతి తెలిసిందే. సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే విధంగా ఉన్నాయని సీజేఐ దృష్టికి తెచ్చారు.

# 11 నుంచి శ్రీనివాస మంగాపురంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి, ఫిబ్రవరి 3: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 11 నుండి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తన కార్యాలయంలో బ్రహ్మోత్సవాల పోస్టర్లు, బుక్‌లెట్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొవిడ్ కారణంగా రెండు సంవత్సరాల తర్వాత స్వామివారి వాహన సేవలు ఆలయ నాలుగు మాడ వీధుల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 11వ తేదీ ఉదయం 8.40 నుంచి 9 గంటల మధ్య ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఫిబ్రవరి 15న రాత్రి గరుడ వాహనము, 16న సాయంత్రం 4 గంటలకు బంగారు రథం, 18న రథోత్సవం, 19న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహనసేవలు జరుగుతాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# మల్యాల గ్రామ సెస్ ప్రాతినిధ్య సభ్యులఎన్నిక..



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం మల్యాల గ్రామ సెస్ ప్రాతినిధ్య సభ్యులుగా మర్రి హన్మాండ్లు. పడిగెల కొండయ్య లు ఎన్నికయ్యారు శుక్రవారం మల్యాల గ్రామపంచాయతీ కార్యాలయంలో సెస్ ప్రాతినిధ్య సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెస్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ ఏఈ స్రవంతి. పంచాయతీ కార్యదర్శి నరేందర్ సెస్ సిబ్బంది పాల్గొన్నారు,

# బీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నాందేడ్ , ఫిబ్రవరి 3ఈనెల 5న మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ విస్తరణలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాందేడ్ బహిరంగ సభకు రానున్నారని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాంకిషన్ రెడ్డి, గంగ్రత్ ఈశ్వర్, బామిని రాజన్న, లోలం శ్యాంసుందర్, డాక్టర్ సుభాష్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. శుక్రవారం ముద్కేడ్ తాలూకా పింపల్ కౌఠా, మెండ్కా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి మహిళలు, యువకులు, వృద్ధులను కలిసి మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. దేశంలోని పేదల జీవితాల్లో వెలుగులు నింపడానికి బీఆర్ఎస్ జాతీయ పార్టీని స్థాపించారని వెల్లడించారు. తెలంగాణలో వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, కల్లుగీత, చేనేత కార్మికులకు ఆసరా పింఛన్లు అందుతున్నాయని పేర్కొన్నారు.

సబ్బండ వర్ణాలు ఆత్మగౌరవంతో జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. ఆడపడుచుల పిల్లల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా లక్ష నూట పదహారు రూపాయలు సీఎం కేసీఆర్ అందిస్తున్నారని అన్నారు. రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 ఉచిత కరెంట్ అందిస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చారని పేర్కొన్నారు. దళితబంధు పథకం ద్వారా దళితులకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తున్నారన్నారు.

# ఉచిత న్యాయ సలహా కేంద్రం ప్రారంభం



సంగారెడ్డి, ఫిబ్రవరి 03 (నేటి నిజం ప్రతినిధి) సమాజంలో న్యాయవిద్య ఉన్నతమైనదని, ఎంతో ప్రాధాన్యత ఉన్నదని ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా ప్రొఫెసర్ డా. గాలి వినోద్ కుమార్ అన్నారు.

శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోనితెలంగాణ గురుకుల గిరిజన రెసిడెన్షియల్ న్యాయ కళాశాలలో ఉచిత న్యాయ సలహా కేంద్రంను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో న్యాయ విద్య ఎంతో ఉన్నతమైన దని, న్యాయ విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. వాటన్నింటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు ఉద్భోధించారు.

అనంతరం సంగారెడ్డి సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్ గారు మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు విద్యార్థి దశ నుండే కోర్టులను సందర్శించి అక్కడ జరిగే వాదోపవాదాలను, కోర్టు ప్రక్రియలను ఎప్పటికప్పుడు తెలుసు కోవాలని, తద్వారా న్యాయ పరిశీలన, పరిజ్ఞానం పెరుగుతుందని సూచించారు . ఉస్మానియ యూనివర్సిటీ అసోషియేట్ ప్రొఫెసర్ డా. ఎన్. రామ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు న్యాయ పరిశీలనకు, సెమినార్లకు హాజరు కావాలన్నారు. దేశంతో పాటు అంతర్జాతీయ న్యాయ పరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

ముఖ్య అతిథులు ఉత్తమ ప్రతిభ కనబరచిన విధ్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ రూత్ కమలినీ మరియు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవ రోజుల్లో ఆలయ దర్శన విధానాలో మార్పులు

శ్రీశైలం ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : శ్రీశైల మహాక్షేత్రంలో జరుగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవ రోజుల్లో ఆలయ దర్శన విధానాలో పలు మార్పులు చేసినట్లు ఈవో లవన్న వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా.. 15 వరకు జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు నిర్ణీత సమయాల్లో మాత్రమే స్పర్శ దర్శనాలు కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే మధ్యాహ్నం సమయంలో జరుగుతున్న ఉచిత దర్శనాలు సైతం బ్రహ్మోత్సవాల ముందు రోజు వరకు మాత్రమే అనుమతించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా శివదీక్షా స్వాములకు చంద్రావతి కల్యాణ మండపంలో, శివదీక్షా శిబిరాల వద్ద నిత్యాన్నదానంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు.మండల దీక్షలు చేసుకుని స్వామిఅమ్మవార్ల దర్శనాలు పూర్తయిన తరువాత జ్యోతిర్ముడి సమర్పణ కోసం శివదీక్షా శిబిరాల వద్ద అర్చక పండితులచే శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే శివస్వాములతోపాటు యాత్రికులు కూడా దర్శన సమయాలను పాటిస్తూ క్యూలైన్ల వద్ద ఆలయ సిబ్బందితో సహకరించాలని ఈవో లవన్న, ధర్మకర్తల మండలి చైర్మెన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి కోరుతున్నారు.

# పెద్దమ్మ తల్లికి చీర సారే సమర్పించిన వికాస్ దంపతులు..



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3: (నేటినిజం ప్రతినిధి): కోనరావుపేట మండలంలోని ఎగ్లాస్ పూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం వారి ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టకు, కళ్యాణ మహోత్సవానికి, నూతన దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ప్రతిమ ఫౌండేషన్ నిర్వాహకులు, డాక్టర్ చెన్నమనేని వికాస్-దీప దంపతులు ముఖ్యఅతిథిగా పాల్గొని దేవాలయాన్ని ప్రారంభించారు. ముందుగా వారిని డప్పు సప్పుల మధ్య ఘనంగా ఆహ్వానించారు. అమ్మవారి కళ్యాణ వేడుకలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు, పెద్దమ్మ తల్లికి చీర సారే సమర్పించారు. ఈ సందర్భంగా వికాస్-దీప మాట్లాడుతూ ప్రజలందరూ అమ్మవారి కృపాకటాక్షాలతో, దయతో ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నామన్నారు. అమ్మవారి కల్యాణంలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలోఎగ్లాస్ పూర్ గ్రామ సర్పంచ్ ఎల్లవ్వ, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నరసింగం, ముదిరాజ్ కుల సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మార్పునకు నాంది.. మన ఊరు-మన బడి: మంత్రి నిరంజన్ రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 3: ప్రభుత్వ ఖర్చులతో ప్రజలకు విద్య, వైద్యం అందించడం రాజ్యాంగ విధి అని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో కూడా దేశంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో విఫలమయ్యామని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలో మన ఊరు-మన బడి నిధులతో ఆధునీకరించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంత్రి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ.. మంచి పాఠశాలలు, విద్యాబోధన, వసతులు, మంచి ఆహారం ఉంటే విద్యార్థులు ఉత్సాహంగా చదువుకుంటారని చెప్పారు.

ఇప్పటివరకు ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ కరువవడంతో తల్లితండ్రులు కష్టపడి తమ పిల్లలను ప్రైవేటుకు పంపిస్తున్నారని తెలిపారు. వారి సంపాదన అంతా విద్య, వైద్యానికి ధారపోస్తున్నారని చెప్పారు. ఆ దుస్థితి నుంచి విముక్తి కల్పిస్తే ప్రజలకు ఖర్చువడంతోపాటు వారి ఆదాయం పెరుగుతుందన్నారు.

ఆరోగ్యవంతమైన, జ్ఞానవంతమైన సమాజం నిర్మాణమవుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అని తెలిపారు. ఇందులోభాగంగా సుధీర్ఘ కసరత్తు అనంతరం మన ఊరు-మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ బడుల మార్పునకు నాందని చెప్పారు. ప్రజలు ఆశించిన విధంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలని సూచించారు. పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ విద్యాలయాల బలోపేతం ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలకు చెక్‌పెట్టొచ్చని వెల్లడించారు.

# ఘనంగా ఎమ్మెల్యే రమేష్ బాబు జన్మదిన వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 3: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు జన్మదిన వేడుకలను శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు నిండు నూరేళు ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోప్రత్యేక పూజలు చేసి కోడే మొక్కును చెల్లించారు. ఆలయంలోని దర్గాలో చాదర్ ను సమర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు,పాలకవర్గ సభ్యులు కోఆప్షన్ సభ్యులు బిఆర్ఎస్ నాయకులు ఆలయం ఎదురుగా కేక్ కట్ చేసి ఆలయ పరిసరాల ప్రాంతంలో ఉన్న యాచకులకు అన్నదానం చేశారు.వేములవాడ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు నిండు నూరేళ్లు బాగుండాలని, నిరంతరం ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే రమేష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి,కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాస్ రావు,మారం కుమార్, ఇప్పప్పుల అజయ్, జోగిని శంకర్,కో ఆప్షన్ సభ్యులు కట్కూరి శ్రీనివాస్, షేక్ బాబున్, నాయకులు రాపల్లి శ్రీధర్, పొలాస నరేందర్, నామాల లక్ష్మి రాజం, మాడిశెట్టి కృపాల్, పెంట బాబు, మైలారం రాము,కార్యకర్తలు ఉన్నారు

# భాను ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి



ఖమ్మం, ఫిబ్రవరి 3: (నేటి నిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని న్యాయవాద దంపతులైన వెూజెన్ కృష్ణ ఫర్ అనురాధ దంపతులపై అమానుషంగా భౌతిక దాడి చేసిన సిపిఐ నేలకొండపల్లి మండల కార్యదర్శి, కర్నాటి భాను ప్రసాద్, అతని అనుచ రులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించా లని, తెలంగాణ రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమ్మద్ అలీని, హైదరాబాదులోని హోం మంత్రి కార్యాలయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు వినతి పత్రం సమర్పించినారు.

ఈ కార్యక్రమంలో, ఐక్యవేదిక చైర్మన్ డాక్టర్ కె.వి కృష్ణారావు, కన్వీనర్ గుంతేటి వీరభద్రం, కో కన్వీనర్లు, షేక్ అబ్దుల్ రహమాన్, బానోత్ బద్రు నాయక్, పద్మాచారి, ఆర్.పి.ఐ పార్టీ ఖమ్మం నల్గొండ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ నగరికంటి సంజీవరావు, పెరుగు వెంకటరమణ యాదవ్, గుండె పోగు అఖిల్, ఐక్యవేదిక మహిళా నాయకులు, ఉపేంద్ర నాయక్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్‌కు అధికారం రాయిలా మారింది

**-రాయలసీమ విషయంలో జగన్ కనీస స్పృహ లేకుండా ఉన్నారు..**

**- తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు**

అమరావతి ఫిబ్రవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌లు, ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమ నిర్వహణ, మెంబర్ షిప్ ఓటర్ వెరిఫికేషన్‌తో పాటు పలు అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ కు అధికారం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందన్నారు. ప్రతిపక్షాలను అణిచివేసేందుకు జీవో నెంబర్ 1 తేవడం.. రాజకీయ పక్షాలపై ఆంక్షలు, కేసులు, ఫోన్ ట్యాపింగ్ వంటి వ్యవహారాలు తప్ప ముఖ్యమంత్రికి రాష్ట్రం గురించి పట్టడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి అడుగడుగునా రాజీ పడుతున్నారని విమర్శించారు. వైసీపీ ఎంపీలు పనిచేసేది సొంత లాబీయింగ్ కోసమే కానీ...రాష్ట్రం కోసం కాదని ఆరోపించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కరువు జిల్లాలకు నిధులు సహా ఒక్క అంశంలో కూడా వైసీపీ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయిందని దుయ్యబట్టారు. కర్ణాటక రాష్ట్రం తలపెట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో సాగునీటి పరంగా రాయలసీమ ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతోందని, ఈ విషయంలో సీఎం జగన్ కనీస స్పృహ లేకుండా ఉన్నారని ఆరోపించారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్యపై సీఎం జగన్ ఇప్పుడు ఇక తప్పించుకోలేరని, తాజా పరిణామాలతో అన్ని వేళ్లూ ఆయన కుటుంబంవైపే చూపుతున్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సొంత పార్టీలో ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు తమ ఫోన్‌లు ట్యాప్ అవుతున్నాయని రోడ్డెక్కిన పరిస్థితిపై ముఖ్యమంత్రి ఖచ్చితంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో అందరు రాజకీయ నాయకుల కంటే ధనికుడైన జగన్... పేదల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు.




# జెండా ఏదైనా ఏజెండా ఒక్కటే...!

## -- ఉమ్మడి ఖమ్మంజిల్లాలో నిల్చొబోయే మన అభ్యర్థులందరినీ గెలిపించుకోవడమే లక్ష్యం

## -- ఇల్లందు క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి




భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 3 (నేటినిజం ప్రతినిధి) :జెండా ఏదైనా ఏజెండా ఒక్కటేనని... రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి శీనన్న సైన్యంగా పోటిచేసే పదిమంది అభ్యర్థులను గెలిపించుకోవడమే లక్ష్యమని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇల్లందు నియోజకవర్గం గార్ల మండలంలోని నెహ్రూ సెంటర్లో పొంగులేటి శీనన్న, కోరం కనకయ్యల క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయగా దానిని శుక్రవారం పొంగులేటి ప్రారంభించి మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొట్టమొదటి శీనన్న క్యాంపు కార్యాలయాన్ని ఇల్లందులో ప్రారంభించడం జరిగిందన్నారు. కోరం కనకన్న నేతృత్వంలో ఈ క్యాంపు కార్యాలయం పనిచేస్తుందని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇక్కడున్న సిబ్బంది ఇల్లందు నియోజకవర్గ ప్రజానీకానికి నిత్యం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

రానున్న రోజుల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పొంగులేటి శీనన్న క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు అవుతాయని ఈ సందర్భంగా వివరించారు. ఇల్లందు నియోజకవర్గ పర్యటనలో భాగంగా గార్ల మండలం, టేకులపల్లి మండలం, ఇల్లందు మండలం, ఇల్లందు పట్టణాల్లో పొంగులేటి పర్యటించారు. గార్ల మండలంలోని మర్రి గూడెంలో వేట వెంకటేశ్వరస్వామిని గుడిని సందర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. పీక్ల తండాలో ఆర్మీ జవాన్ భూక్యా రమేష్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా మూడ్ తండా, గార్ల, ఇల్లందు మండలంలోని రేపల్లెవాడ, ఇల్లందు పట్టణం, టేకులపల్లి మండలంలోని బోడ్, 9వ మైల్ తండాల్లో పొంగులేటి పర్యటించారు. ఆయా కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆర్థిక సాయాలను కూడా అందజేశారు. పొంగులేటి వెంట డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, ఇల్లందు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు ఉన్నారు.

# సిఐ కార్యాలయాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం, ఫిబ్రవరి 3: (నేటినిజం ప్రతినిధి): అధునిక సౌకర్యాన్ని జోడించి పునరుద్దరించబడిన సింగరేణి సర్కిల్ ఇన్స్‌పెక్టర్(సిఐ)కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ శుక్రవారం ప్రారంభించారు. సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పాత కార్యాలయం ఇటీవల శిధిలావస్థలో చేరడంతో పునరుద్ధరణ పనులు చేపట్టి పూర్తి చేశారు. అదేవిధంగా కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగంగా కారేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పోలీస్ కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...పోలీస్ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, ప్రజావసరాలకు అనుగుణంగా పోలీస్ కార్యాలయు భవనాలను తీర్చిదిద్దుతూ..పోలీస్ శాఖను మరింత బలోపేతం చేసేదిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మెరుగైన సమాజం కోసం నేనుసైతం, కమ్యూనిటీ పోలిసింగ్ లో భాగస్వామ్యమై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఖమ్మం పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టిని సారించిందని, ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా కెమెరాలతో నిఘా నీడల్లోకి తీసుకొచ్చి... ప్రజల రక్షణగా ఉండాలనే లక్ష్యంతో టెక్నాలజీ పరమైన సంస్కరణలు తీసుకురావడం సంకల్ప లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తుందని అన్నారు. 24 గంటలు నిర్విరామంగా పనిచేసే ఒక సీసీ కెమెరా వందమంది కానిస్టేబుళ్లతో సమానమని అన్నారు. మీ ప్రాంతాలలో అపరిచిత వ్యక్తుల కదలికలు, అసాంఘీక కార్యకాలపాలు, గుర్తించడానికి సీసీ కెమెరాలు ఎంతోగానో సహకరిస్తాయని అన్నారు.

నేరస్థులు కూడా కొత్త తరహా పద్ధతులను ఎంచుకుని నేరాలు చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న ప్రస్తుత తరుణంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ భస్వారెడ్డి, సిఐ ఆరీఫ్ ఆలీ ఖాన్, ఎస్సైలు పాల్గొన్నారు.

# ఖమ్మం టౌన్ ఏసీపీగా పీవీ.గణేష్ భాధ్యతలు స్వీకరణ

ఖమ్మం, ఫిబ్రవరి 3: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం టౌన్



ఏసీపీగా పీవీ.గణేష్ ఖమ్మం ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. ఆనంతరం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆనంతరం అడిషనల్ డీసీపీ లాఅండ్ఆర్డర్ సుభాష్ చంద్ర బోస్ ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.




**IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM-I ADDL CHIEF JUDGE: C.C.C. AT SECUNDERABAD**
**O.P. NO.549 OF 2021**

Between:
**Bandela Aravind** .....Petitioners
**And**
**Mr. B.Anil others** **...Respondents**

To
1.Mr.B. Anil S/o B. Mosha @ Basha (Driver of Crime Vehicle)
Aged about Major,
Occ: Car Driver
R/o. H.No. 4-1-216/7/1 Karthikeya Nagar Habsiguda, Uppal Medchal. T.S-500007.
2. Mr. Siliveri Sandeep Kumar S/o.S.Sampath Kumar,
Aged about: Major,
Occ: Business (Owner of Crime Vehicle)
R/o. H.No.3-7-51/25, Janapriya Enclave, Mansoorabad, Hayathnagar, R.R.Dist, T.S- 500068.

**NOTICE**

Please take notice that in the above matter the petitioner had filed a case against you (Respondent No.1 & 2) for compensation of Rs. 50,00,000/- and the same is posted for your appearance on **6-2-2023.**

You are advised to appear on **6-2-2023** at 10.30 a.m. before the said court either in person or through an advocate failing which the case will be decided exparte.

(BY THE ORDER OF THE COURT)

**M/S. B. NAGA RAJU YADAV**
**BANDI KALAVATHI**
**GODUGU KRISHNA**
**Advocates**
**H.NO. 3-12-126/1/405 P.S. Residency, P.S. Colony Ramanthapur Amberpet, HYD-13**
**CELL:7675975689 9959858035**

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail: netinijam93@gmail.com.